బిడ్డల శిక్షణ సక్రమంగా లేనప్పుడు, అది వారిని వక్రమార్గాన పెడుతుంది. పసివారి మనసులను అర్థం చేసుకోకుండా అయిన దానికి, కాని దానికి దండిస్తే, అది వారి పాలిట విరక్తిగా మారి, పెద్దలనే శిక్షిస్తుంది.

హోరున జోరుగా వర్షం కురుస్తూంది. చీకటి మబ్బుల ముసుగులో ప్రకృతి అంతా స్నానమాడుతూంది.

ఆ ఇంటి అరుగుమీద, చూరుకింద ముడిచి పెట్టుకుని కూర్చున్నాడు బాబి. వాడికి పదేళ్లుంటాయి. మోకాళ్లమీద గడ్డం ఆనించుకొని ఎందుకో వర్షం లోకి తదేకంగా చూస్తున్నాడు. వాడి బుల్లిమనస్సులో ఏవేవో ఆలోచనలు. . .

'పాపం. . . ఈ వర్షం తగ్గదుకాబోలు. . .' అనుకున్నాడు బాబి. ఒకసారి రాము అన్నాడు, ఆకాశానికి ఏడుపొస్తే వర్షం పడుతుందిట. నాడికెవరు చెప్పారో? ఒక్కొక్కసారి ఇలాగే రెండేసి రోజులు ఏడుస్తూనే ఉంటుందిట. దాని కన్నీళ్లు ఇవేట. 'పాపం. . . ఇంకా ఎంతసేపు ఇలా ఏడుస్తుందో. . .' బాబి ఆలోచనలు, రోడ్డుమీది నీళ్లలా పల్లానికి జారిపోతున్నాయి.

'వాళ్ల నాన్నకూడా గట్టిగా కొట్టాడు కాబోలు. అవును కొట్టేఉంటాడు. ఆకాశానికి నాన్న ఎవరో? ఛ, ఈ నాన్నలకి బుద్ధిలేదు. ఇందాకా నన్నుకూడా నాన్న కొట్టాడుగా. నాన్న మంచివాడు కాదు. ఎప్పుడూ కొడుతూనే ఉంటాడు.' ఇలా ఆలోచించుకుంటున్న వాడి కళ్లలో నీళ్లు సుళ్లు తిరిగాయి. ప్రకృతి ఇంకా మసకబారింది.

'సిరాబుడ్డి చెయ్యి జారి కిందపడింది. అంతలోనే నాన్న ఎంత గట్టిగా కొట్టాడో! నా కెంత నొప్పి పెట్టిందో నాన్నకెలా తెలుస్తుంది?. . .'

బాబికి ఉదయం జరిగినదంతా గుర్తుకి వస్తూంది. తను సిరాబుడ్డి తియ్యడం, గ్లాసుడు నీళ్లలో నాలుగు చుక్కలు సిరా పోసి గ్లాసుడు సిరా తయారు చెయ్యడం. . . అంతా జ్ఞాపకం వచ్చింది. ఆ సిరా నాన్నకిచ్చి "నాన్నా, బోలెడు సిరా తయారుచేశాను. ఇంకో పెద్దసీసాలో పోసుకో" అని చెబుదామను కుంటున్నాడు. ఇంతలో చెయ్యి జారింది. సిరాబుడ్డి కిందపడింది. నల్లటి గాజుపెంకులు భళ్లున చెల్లా చెదురుగా పడ్డాయి. తను బిత్తరపోయాడు. అప్పుడే ఇంట్లోంచి నాన్న వచ్చాడు., "ఏమిట్రా వెధవా ఆ చప్పుడు?" అంటూ! బిక్కమొగం వేసుకు నించున్నాడు తను. నాన్నే అంతా చూశాడు. తన చెవి మెలిపెట్టి పట్టుకున్నాడు. ముఖంలో ముఖంపెట్టి, పళ్లు పట పట లాడించాడు. "ఇలాంటి పాడుపన్లు చెయ్యొద్దని ఎన్ని సార్లు చెప్పాన్రా నీకు? వెధవా, ఈసారి నా గదిలో అడుగెట్టి చూడు. కాళ్లు విరుస్తాను." అంటూ దబదబా బాదాడు. వీపు పగిలిపోయి కుంపటిలా మండింది.

బాబికి ఆ సంఘటన అంతా మళ్లీ జరుగుతున్నట్లు అనిపించింది. దీనంగా వీపు తడుముకున్నాడు. దుఃఖం ముంచుకువస్తోంది. కుమిలి కుమిలి లోలోపల ఏడుస్తున్నాడు. ఏడుపు గట్టిగా వినిపిస్తే నాన్న మళ్లీ కొడతాడని కొరివిలాంటి భయం వాడికి.

[illegible] పాడుచెయ్యడమేకాక మళ్లీ ఏడుపొ [illegible] అంటూ ఇందాకనే మరో రెండు [illegible] వద్దని పాపం అమ్మ చెబుతూనే [illegible] నాన్న వింటేగా! నాన్నకి నా మీద కోపం.






ఎందుకో అంత కోపం? మొన్ననేమో పలక బద్దలయిందని కొట్టాడు, ఆ వేళేమో పెనసలు పారేసుకున్నానని! కొట్టడం నాన్నకి సరదా కాబోలు! ఏ స్తంభాలనో, గోడలనో కొట్టుకోకూడదూ? ఊహూఁ. నా వీపైతే మెత్తగా ఉంటుంది. ఒక రోజున దెబ్బ తగిలి ఏడుస్తూంటే "ఆటలాడ్డం, దెబ్బలు తగిలించుకోవడం వెధవాయ్, నోర్ముయ్. ఇక్కడనుంచి ఇంట్లోనే పడుండు." అంటూ కొట్టాడు. దెబ్బ తగిలితే ఏడుపు రాదు కాబోలు! ఏడుస్తున్నందుకూ కొట్టడమే! థు, నాన్న మంచివాడు కాదు.

వాడి పసిహృదయంలో, తండ్రిమీది అసహ్యం ముళ్లపొదలా పెరుగుతూంది, ఏపుగా! శిక్షించే తండ్రి పక్కన లాలించే తల్లి నిలబడుతూంది.

అమ్మ చాలా మంచిది. అమ్మ నన్ను ముద్దు పెట్టుకుంటుంది. అన్నం పెడుతుంది. డబ్బులిస్తుంది. ఆడుకోడానికి బొమ్మలిస్తుంది. అమ్మ ఎంతో మంచిది. అయినా అమ్మ ఏది చెప్పినా నాన్న వినడు. నాతో సరిగ్గా మాట్లాడడు. నాన్న కెందుకో అంత కోపం?

విరామరహితంగా కురుస్తున్న వర్షంలోకే చూస్తూ చాలా చాలా ఆలోచించుకుంటున్నాడు బాబీ. ఆ వయస్సులో ఆ మనస్సుకి అంతటి ఆలోచనలుంటాయని సాధారణంగా అనుకోం. ఆ వయస్సులోని మనస్సుకి అంతటి కఠినత్వాన్ని అందించడం పొరపాటని తలచం. సున్నితమైన గాజుపాత్ర పగిలి తునాతునకలైంది. వర్షం కురుస్తూనే ఉంది, ఆకాశపు వస్త్రాన్ని నీళ్లలో ముంచి ఎవరో పిండుతున్నట్టు!

"బాబీ. . . బాబీ. . ." ఇంట్లోనుంచి తల్లి పిలుస్తూంది. "ఒరేయ్ బాబీ. . . ఎక్కడ్రా?"

"ఇదిగో ఇక్కడున్నా' అందామనుకున్నవాడు అంతలోనే ఊరుకున్నాడు. 'ఊహూఁ. ఇంట్లోకి వెళ్లను. వెడితే మళ్లీ మళ్లీ నాన్నచేత దెబ్బలు తినాలి.' ఉక్రోషంగా అనుకున్నాడు. గోడమూలకి బాగా ఒదిగి కూర్చున్నాడు.

"ఒరేయ్. . . బాబీ. . ."

"ఎందుకే అలా గావుకేక లెడతావు? ఏ మూల గదిలోనో ఉంటాడు. వాణ్ణి పిలవకు. ఆకలేసినప్పుడు వాడే వస్తాడు. నువ్వలా గారాం చేస్తుండబట్టే వాడలా తయారవుతున్నాడు." రాజారావు గొంతు కఠినంగా వినిపించింది.

'ఏం? నే నెలా తయారయాను?' కోపంగా అనుకున్నాడు బాబీ.

'మీరు మరీను, పిల్లల్ని ప్రతిదానికీ అలా బాదుతూ ఉంటే బాగుపడుతారనుకున్నారేమిటి? మీకు తోచదు, ఒకరు చెబితే వినరు. అదిగో ఆ పక్కింటి సుబ్బలక్ష్మిగారబ్బాయి చూ. . ." ఆమె వాక్యం ఇంకా పూర్తి చెయ్యకుండానే రాజారావు గది మూడు "నోరు ముయ్యవే నీ కేం తెలుసు?" అంతే. అంతటితో ఇంట్లోంచి వినిపిస్తున్న సంభాషణ ఆగిపోయింది.

'అవును, అన్నీ నీకే తెలుసు పేద్ద! ఏ రాక్షసుడేనా విన్ను గట్టిగా తంతే అప్పుడు నీ పని అవుతుంది. బాబి కసిగా అనుకున్నాడు.

'ఊహూఁ. చస్తే ఇంక నేను ఇంట్లోకి వెళ్లను. ఇక్కడే ఇలాగే కూచుంటాను. ఆకలేసినా ఏడవను. నే నెక్కడున్నా నాన్న రమ్మని పిలవడుగా. పోనీ నా కేం బాధ? నేను ఇంట్లోకి వెళ్లనే వెళ్లను. వాడి ఊహలు ఇలా సాగుతున్నాయి. అప్రయత్నంగా కళ్లనిండా నీళ్ళు చేరాయి.

ప్రియుణ్ణి కోల్పోయిన ప్రేయసిలా ఆకాశం వర్షిస్తూనే ఉంది. ప్రియురాలి విరహపు నిట్టూర్పుల్లాగ హోరున గాలి!

'పాపం. . . అమ్మ నన్ను వెతుక్కుంటుంది. ఇంట్లోకి రమ్మంటుంది. బ్రతిమాలుతుంది. తిండానికి తాయిలాలు పెడతానంటుంది. ఇంట్లోకి వెళ్లకపోతే ఏడుస్తుందేమో. . .? ఆ వేళ అలాగే ఏడిచిందిగా. అమ్మ నన్ను చూడకుండా ఉండలేదు. అమ్మ ఎంతో మంచిది. అమ్మని చూడకుండా ఎలా ఉండను? అమ్మ కోసం ఒక్కసారి ఇంట్లోకి వెళ్లొస్తే ...? నాన్న చూస్తాడు. కొడతాడు. అవును, ఏమైనాసరే ఇంక నాన్నకి కనిపించకూడదు.' బొంగరాల్లాగ వాడి మనసులో ఆలోచనలు తిరుగుతున్నాయి. ఆగి, ఆగి తిరుగుతున్నాయి, వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు.

సూర్యుడెంతదూరం పరిగెత్తాడో మబ్బుల చీకట్లో ఎవ్వరికీ తెలియలేదు. ఎవ్వరికీ కనిపించలేదు.

వర్షం నీరసంగా తగ్గుముఖం పట్టింది. అలిసిపోయి చిన్న చిన్న తుంపరలా పడుతూంది. రోడ్డుమీది ఎర్రటినీళ్లు ఏదో పెద్ద పని ఉన్నట్టు వేగంగా పల్లానికి పరిగెడుతున్నాయి. వర్షాన్ని చూస్తున్న బాబీకీ దుఃఖానికీ మధ్య సన్నని తెర వాలింది. సన్నటి చినుకుల్లో గెంతుతూ ఆడుకోవాలనిపిస్తూంది వాడికి. అంతలోనే 'నాన్న కొడతాడేమో' అనే భయం వాడిని నొక్కి గోడమూలకు తోస్తూంది.దిక్కులు చూస్తూ దిగాలుగా కూర్చున్నాడు.

ఎదురింటి రమణయ్యగారబ్బాయి గోపి, వాడి చెల్లెలు పాప అరుగుమీదికి వచ్చారు. వాళ్ల చేతుల నిండా చాలా కాయితాలున్నాయి. వాళ్ల ముఖాలనిండా కెరటాలు వేస్తున్న బోలెడు సంతోషం.

చూరునీళ్లలో చేతులుంచి కెరింతలు కొడుతూంది పాప. గోపి ఆనందంగా ఏదో అంటున్నాడు.

గోపి, నీటిలో వదిలిన పడవ ఊగిసలాడుతూ వేగంగా వెళ్లిపోతూంటే పాప ఉత్సాహంతో చప్పట్లు చరుస్తూంది.

బాబీ చూస్తున్నాడు.

నీళ్లలో కాళ్లు తపతప లాడిస్తున్నాడు గోపి. పాప, వాడి వెనకాల నిలబడి ఏదో అడుగుతూంది. చిన్నచినుకులుమీద పడుతున్నట్టే వాళ్లకి తెలియదు.

బాబీకికూడా వాళ్లతో కలిసి ఆడుకోవాలనిపిస్తూంది కాని నాన్న కొడతాడేమోనని ఒక మూల సందేహం, భయం. అలాగే చూస్తూ కూర్చున్నాడు, కూర్చోలేకనూ పోతున్నాడు. కాగితం పడవలు వాడిని కవ్విస్తూ పిలుస్తున్నాయి. అయినా వాడు కదలలేక దిగులుపడి చూస్తున్నాడు. దిగులుతోబాటు అసూయ కూడా కలుగుతూంది. నడవలేనివాడు, కదిలిపోతున్న కార్లవంక చూస్తున్నట్టుగా ఉంది వాడి అంతరంగం.

ఎంతోసేపు అలా కూర్చోలేకపోయాడు బాబి. ధైర్యాన్ని పోగుచేసుకుంటూ లేచాడు. అంతలోకే భయంతో వాడి శరీరం జలదరించింది. బెరుకుగా

ఆకొండి వెంకటరత్నం

సైకి లెక్కే వారికి చాల ఇష్టమైనవి

# మిల్లర్ సైకిల్ డైనమో

# లైటింగ్ సెట్లు

మిల్లర్ సైకిల్ డైనమో లైటింగ్ సెట్లు

25 మీటర్ల (30 గజాల) పైబడి ముందుకు ఏకరీతిని ప్రకాశవంతమైన వెలుగునిస్తాయి. ఉన్నతమైన పాటవానికి, నమ్మకమైన సర్వీసుకు ఎల్లప్పుడూ మిల్లర్ సైకిల్ డైనమో లైటింగ్ సెట్లను పేరుచెప్పి కోరుకోవండి.

మిల్లర్ లాంప్‌తో మీరు సదా సరైన దారినే ఉంటారు.

95 సంవత్సరాల పైబడి పేరుపొందిన హెచ్. మిల్లర్ అండ్ కంపెనీ లిమిటెడ్, బర్మింగ్‌హాం. ఇంగ్లండు వారితో సహకృషిని తయారు చెయ్యబడినవి.

MILLER ®

టివి మిల్లర్ లిమిటెడ్, మద్రాసు-1. వర్క్సు : అంబత్తూరు, మద్రాసు-53.
® హెచ్. మిల్లర్ అండ్ కంపెనీ లిమిటెడ్. ఇంగ్లండువారి రిజిస్టర్డు ట్రేడ్‌మార్కు
ఇండియాలో తయారుచేసినవారు : టివి మిల్లర్ లిమిటెడ్. మద్రాసు-1.
రిజిస్టర్డు వాడకందార్లు

ఒక (TI) ఉపసంస



FDS TIM 907 TE


ఒకసారి లోనికి చూశాడు. ఎవ్వరూ తనని గమనించడం లేదు. నైరిధైర్యంతో తన ఆశ తీర్చుకోడానికి అరుగు దిగాడు. తల వంచుకుని చాటుగా, నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ తన మిత్రులను సమీపించాడు. వాళ్ల అరుగుమీద, స్తంభంవారన, నిలబడి వాళ్లను చూస్తున్నాడు. తనకు పడవలు చేసుకోడానికి కాయితాలు లేవు, ఎలాగ?

"ఏరా బాబీ అలా ఉన్నావు?" ఆప్యాయంగా వాడి భుజం తడుతూ గోపి అడిగాడు.

"ఏం లేదురా." ముక్తసరిగా అన్నాడు బాబి.

"కాదు. మీ నాన్న కొట్టకపోతే నువ్వలా ఉండవు. అసలు మీ నాన్న మంచివాడు కాదురా. ఆ వేళ మనం వర్షంలో ఎంచక్కా ఆడుకొంటుంటే మీ నాన్న నిన్ను కొట్టలేదూ? మా నాన్నగారు చూడు, పడవలు చేసుకోడానికి ఎన్ని కాయితాలిస్తారో! ఊఁ. . . పోన్లేగాని నువ్వుకూడా సరదాగా రెండు పడవలు వదులు." అంటూ నాలుగు కాయితాలు బాబీ చేతులో పెట్టాడు. గోపీ మాటల్లో చాలా సానుభూతి ఉంది.

కొద్దిగా మరుపుకి వచ్చిన బాబీ దుఃఖం మళ్లీ ముంచుకు వచ్చింది. కళ్లు చెమ్మగిల్లాయి. వాడి గుండెలనిండా కనిపించని ముళ్లు గుచ్చుకున్నాయి. మనసులో, నాన్న దయ్యంలా వించున్నాడు. ఇంక అక్కడ ఉండాలనిపించలేదు వాడికి. కాని వెళ్లాలనీ లేదు.

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా చూస్తూ నిలబడ్డాడు. గోపీ చేసి ఇచ్చిన పడవలు తీసుకవెళ్లి నీటిలోనించి తనకు తెలియకుండానే మరణంలోకి పంపిస్తూంది పాప.

దుఃఖాన్ని మరిచిపోవడానికి ప్రయత్నిస్తూ చొక్కా చేతితో కళ్లు ఒత్తుకున్నాడు బాబి. ఇంకా అక్కడే ఉంటే నాన్న కొడతాడనే భయంతో. కాయితాలు జేబులో ఉంచుకొని రోడ్డుమీద నడక సాగించాడు, గోపీ పిలుస్తున్నా వినిపించుకోకుండా.

నీళ్లలో నెమ్మదిగా నడుస్తున్నాడు బాబి. చిన్న చిన్న చినుకులు శరీరంమీద పడుతున్నాయి. ఎంతో హాయిగా ఉంది. ఇంకా అలాగే ఎంతో దూరం నడవాలని పిస్తూంది వాడికి.

'నే నిలా చినుకుల్లో నడవడం నాన్నచూస్తే ఏం చేస్తాడో. . .?' అనుకునేసరికి వాడి హృదయంలో భయం, తండ్రిమీద అసహ్యం వెదురుముళ్లలా మెదిలాయి. 'అసలు నే నంటే నాన్నకెందుకంత కోపం? ఊహూఁ. . . ఇంకెప్పుడూ ఆ కోపిష్టినాన్నకి కనిపించ కూడదు.'

బాబి నడుస్తున్నాడు. వాడి మనస్సులో క్రమబద్ధం గాని ఆలోచనలు గంతులు వేస్తున్నాయి. జవాబులేని ప్రశ్నలెన్నో వాడిని చుట్టుకుంటున్నాయి. ఎక్కడకు వెళ్లాలో, ఏం చెయ్యాలో వాడికి తెలియదు. . . అనాలోచితంగా ముందుకు నడుస్తున్నాడు.

'నేను కనిపించకపోతే అమ్మ ఏడుస్తుంది. కనిపిస్తే నాన్న కొడతాడు. నాన్నకి కనిపించకుండా ఇంట్లో దాక్కుంటే. . .? అప్పుడు నాన్న నన్ను కొట్టలేడు. పెద్ద మంచం కిందనున్న పెట్టెల వెనకాతల పడుక్కుంటే. . .'

పరధ్యాన్నంగా నడుస్తున్న బాబి కాలుజారి బురదలో పడ్డాడు. బట్టలనిండా బాడిసీళ్లు రంగులు వేశాయి. బట్టలవైపు చూసుకుంటూ నిలబడిపోయాడు. వాడి

కళ్లలో మళ్లీ నీళ్లు తిరిగాయి. ఈ బాడిబట్టలతో వాన్నకి కనిపిస్తే ఏం జరుగుతుందో వాడికి బాగా తెలుసు. మోచేతిమీది చర్మం గీరుకుపోయిన సంగతి వాడికి తెలియనే లేదు. చాలాసేపు అలాగే చూసుకుంటూ నిలబడిపోయాడు. ఆఖరికి కారుతున్న కన్నీళ్లు తుడుచుకుంటూ ఏదో నిశ్చయంతో ముందుకు కదిలాడు.

పెద్ద వంతెనమీదికి వచ్చి ఆగిపోయాడు. బాడితో తడిసిన చొక్కా విప్పి భుజంమీద వేసుకున్నాడు. వంతెనగట్టుకి ఆనుకుని కాలువలోకి చూశాడు. కాలువలో నీరుకూడా బురదలా, రక్తంలా, నిండుగా పారుతూంది. తన బట్టలు ఉతకడానికి ఈ నీరు పనికివచ్చేలా లేదు. ఆలోచిస్తూ జేబులోని కాయితం తీసి పడవ తయారు చేస్తున్నాడు. పడవ తయారయింది. ఎత్తైన కాలువ గట్టుమీదికి నడిచాడు. ఒక వైపు పంటచేలు, మరొక వైపు లోతైన కాలవ. తడిసిన మట్టిగట్టుమీద కాలు జారుతూంది. పడిపోకుండా జాగ్రత్త పడుతూ ముందుకు నడుస్తున్నాడు. నీళ్లలోకి చూస్తుంటే వాడి కళ్లు తిరుగుతున్నాయి.

గట్టుమీద ఒక చోట నిలబడి చుట్టూ చూశాడు. తడిసిన చెట్లు నీళ్ళు రాల్చుతున్నాయి. రాము అన్న మాట మళ్లీ జ్ఞాపకం వచ్చింది. 'ఆకాశంతోపాటు చెట్లుకూడా ఏడుస్తాయి కాబోలు, పాపం' అనుకున్నాడు. మళ్లీ అమ్మ, నాన్న, నాన్నతోపాటు గోపీవాళ్ల నాన్నగారు, గోపీ, పాప అందరూ జ్ఞాపకం వచ్చారు. బురదతో నిండిన చొక్కాని చూసుకున్నాడు. భయమూ, దుఃఖమూ గుండెల్లో కదిలాయి.

రేవులో దిగి బట్టలు పులమడానికి వాడికి ధైర్యం చాలడం లేదు. దిగాలుగా ఎంతోసేపు అలాగే నిలుచుండిపోయాడు. అప్రయత్నంగా చేతిలో ఉన్న పడవ గుర్తు వచ్చింది. ఈ కాలవలో అది ఎలా నడుస్తుందో చూడాలనిపించింది వాడికి. అనిపించడంతోనే అతి జాగ్రత్తగా దానిని నీటిలో వదిలాడు. బుల్లి బుల్లి అలలమీద ఊగిసలాడుతూ పడవ వేగంగా వెళ్లిపోతూంది. పడవను చూస్తున్న బాబి దుఃఖానికి దూరమయ్యాడు. అన్నీ మరిచిపోతున్నాడు.

'గోపీగాడి పడవ అక్కడే ఆగిపోయింది. నా పడవ ఎంత దూరం వెడుతుందో చూడాలి' అనుకుంటూ రేకెత్తుతున్న ఉత్సాహంతో పడవగమనాన్ని గమనిస్తూ గట్టుమీద నడుస్తున్నాడు. పడవ దూరదూరంగా వెడుతూంది.

కాయితంపడవ మహాప్రవాహంలో ఎంతోసేపునడవదని వాడికి అప్పట్లో తెలియదు.

కొద్దిసేపటికి నీటివేగానికి పడవ తలకిందులైంది. పూర్తిగా కనిపించకుండా పోయింది.

## 2

మళ్లీ వర్షం ఎక్కువైంది. ఆకాశంమీదనించి సముద్రాన్ని బోర్లించినట్టు నిర్విరామంగా కురుస్తూంది.

"ఈ వానలో ఎక్కడున్నాడో ఏమో? ప్రొద్దుటనగా వెళ్లినవాడు రాత్రయినా ఇంటికి రాలేదు. ఎక్కడున్నాడో ఏం తిన్నాడో? అప్పుడు వాణ్ణి పిలుస్తుంటే కసిరిపోశారు. ఎక్కడకు వెళ్లాడో తెలియదు." జానకి కంటితడి తుడుచుకుంటూ అతి ప్రయత్నంమీద రుద్ధకంఠంతో అంది. ఎన్నిసార్లు తుడుచుకున్నా కన్నీరు ఆగడం లేదు ఆశించని వర్షంలా.

"ఏమో ఎక్కడున్నాడో, అన్ని చోట్లా తిరిగి వచ్చాను. ఎక్కడా కనిపించలేదు." పేలవంగా అన్నాడు రాజారావు.

జానకి నిశ్శబ్దంగా రోదిస్తూంది.

"ఛ ఏమిటి జానకీ నీ పిచ్చి మధ్యాహ్నంనించీ వర్షం తగ్గలేదాయె. ఎలా వస్తాడు? ఏ స్నేహితుడి ఇంట్లోనో ఉండి ఉంటాడు. నాకు మాత్రం వాడిమీద ప్రేమ లేదంటావా? నువ్వలా కన్నీరు పెట్టుకోకు." తనకు తోచిన మాటలతో భార్యను ఊరడించడానికి ప్రయత్నిస్తున్నాడు రాజారావు. నిజానికి అతనుకూడా ఆందోళన పడుతున్నాడు. అతని హృదయం తడిసి ముద్దలా ఉంది.

"అన్నీ తిరిగి చూశానన్నారుగా, ఇంకెక్కడుంటాడు?" తనకు తాను ధైర్యం చెప్పుకోవాలని, దుఃఖాన్ని దూరం చెయ్యాలని ప్రయత్నిస్తూ భర్త కళ్లలోకి చూసింది. ఆమె కళ్లలోని దైన్యాన్ని చూడలేక అతను తల వంచుకున్నాడు. కొడుకు ఎక్కడకు వెళ్లాడు అన్నది అతనికికూడా సమస్యే. అనాలోచితమైన తన కోసం వల్లనే వాడు ఎటో వెళ్లిపోయాడా? అతను ఆలోచిస్తున్నాడు.

"ఏమండీ, మళ్లీ ఒక్కసారి వెళ్లి వెతికి రారూ?"

రాజారావు, భార్య ముఖంలోకి చూశాడు. ఆమె వదనంలోని విషాదం అతని గుండెల్ని కోస్తూంది. యాంత్రికంగా లేచాడు. గొడుగు తీసుకున్నాడు.

"తొందరగా తీసుకురండి. నిన్న రాత్రి తిన్న అన్నం ఎక్కడున్నాడో, ఎంత ఆకలితో ఉన్నాడో? వాడికిష్టమైన బంగాళాదుంపలకూరకూడా చేశాను. తొందరగా వాణ్ణి తీసుకొస్తారుకదూ?" ఆవేదనతో ఆమె గొంతు పూడుకుపోయింది.

కొద్ది క్షణాలు అతను భార్యను చూస్తూ నిలబడ్డాడు ఏదో చెప్పాలనుకున్న అతని నాలుక తడబడింది. మౌనంగా ఆమె కన్నీళ్లు తుడిచాడు. అంతకన్న ఆమె నెలా ఓదార్చాలో అతనికి తెలియదు. గుమ్మంవైపు నడిచాడు.

నెమ్మదిగా రోడ్డుమీద గొడుగునీడలో నడిచి వెడుతున్న భర్తని గుమ్మంలో నిలబడి చూస్తూంది జానకి. ఆమెకళ్లు వర్షిస్తున్నాయి.

వీధిదీపాల వెలుగులో మసగ మసగగా రాజారావు దీనంగా కదులుతున్నాడు. ఎక్కడకు వెళ్లాలో, బాబి ఎక్కడున్నాడో అతనికి తెలియదు. అతని కాళ్లు నడిపించినవైపు నడుస్తున్నాడు, కొడుకు కనపడక పోవడాన్నిగూర్చి ఆలోచిస్తూ.

నడుస్తున్న రాజారావు గుండెల్ని చేత్తో రాసుకున్నాడు. కాయితంపడవ, కాలవలో మునిగిపోయిందని తెలిస్తే అతను ఏంచేస్తాడో మరి?. . . ★



నలుపూ తెలుపూ — ఫోటో — కె. జి. నటేశన్ (తిరుచ్చి-14)